క్రొత్తగా ఊరు వచ్చినా తప్పలేదు. ఇట్టే పట్టేసేరు. దిక్కుమాలిన చావు. నాలుగైదు గంటలు కూర్చుని ఏడవాలి.

"ఏమండి.... నే రాలేదని ఏదన్నా సాకు చెప్పేనా?" అని మొగుడితో సంప్రదించింది.

"ఛా— అదెలాగ! నోట్లో నాలికున్న దానివి. ఊళ్లో ఉన్న పెద్ద ఆఫీసర్లలో ఓ పెద్ద ఆఫీసరుగారి పెళ్లానివి. హోదా కోసం మనలా బాధ పడాల్సిందే. నీతోపాటు నేనూ కొనదాకా వేదికమీద ఉండవల్సిందే కదా!" అన్నారు పెళ్లాంతో ఏజంటుగారు.

ఏజంటుగారి పెళ్ళాం సావిత్రమ్మ చక్కగానే ఉపన్యసిస్తుంది ఏజంటుగారు వక్తల్లోజమ. ఆయన్ని అధ్యక్షుని గానూ ఆవిణ్ణి బహుమతులు ప్రదానం చెయ్యడానికీ కాలేజీ వాళ్ళు పిలిచేరు. ఎక్కడికీ వెళ్ళకుండా నాలుగ్గోడల మధ్య ఏ చీరకో ఎంబ్రాయిడరి చేసుకున్నంత సౌఖ్యం మరోటిలేదు, బదిలీ అయిందనగానే అమ్మయ్య అనుకుంది. మహిళా సమాజం గొడవలు ఊరి ఆఫీసర్ల పెళ్ళాల గొడవలు, స్త్రీ సంక్షేమ కార్యక్రమాలు అన్నిటికి స్వస్తి చెప్పి ఇంట్లో కూర్చుందామనుకుంది. అందులో ఈ బంగళాకి చుట్టూ కావల్సినంత పెరడుంది. హాయిగా తోట పెంచుకుందామనుకుంది. కాలేజీవాళ్ళు బహుమతులు ఇవ్వడానికి పిల్చేరు. వెళ్ళక తప్పలేదు. మహిళా మండలి కార్యదర్శినిగారు కౌగిలించేసుకుని రేపు ఆదివారం రావాలి సుమండీ అని చెప్పేసింది. చచ్చే చావు! అడవిలోకి వెళ్ళినా ఇవి తప్పే ట్టులేవు!

ఆ బేంకు బంట్రోతు దాసీదాన్ని తీసుకు వచ్చాడు. దాని మొహం చూస్తే ఒళ్ళు మండింది. పేరు సత్తి. చింత మొద్దులా ఉంది. ఇంట్లో పని చేసే దాసీ దైనా కాస్త లక్షణంగా ఉండాలి. ఈదిక్కుమాలిన ఊళ్ళో దాసీవాళ్ళు దొరకడమే కష్టంట! దీన్ని చూస్తే ఒళ్ళు జలదరిస్తోంది!

"నువ్వు మాఇంట్లో పని చెయ్యగలవా?" అని మహా గీరగా అడిగింది.

'తమరు సెపితే సేసుకుంటూ పోతాను' ఎంతో మార్దవంగా తియ్యని కంఠంతో గీరగా వేసిన ప్రశ్నకి జవాబు చెప్పింది.

"దీని కంఠం బాగుంది! దీని మొహం ఎంత మసిబొగ్గులా వుందో దాని కంఠంలోంచి వచ్చిన మాట అంత ముద్దుగా వుంది. అమాయక మైన మూడేళ్ళ ఆడపిల్లలాగ చెప్పింది. చెప్పి వీపు మీదున్న జడని గుండెల మీదకి తెచ్చుకుంది. గోరుకి నొక్కుకుపోయి ఏదో భయపడ్డు న్నట్టు మొహం పెట్టింది. జడలో రెండు గేట్లోనే కాబోలు రెండు ఎర్ర గన్నేరు పువ్వులు పెట్టుకుంది. మనిషి కురూపైనా షోకుచేసే గుణం అట్టడుగు నుంచీ హైక్లాసు ఆడవాళ్ళదాకా తరతమ భేదాలతో కనపడు తుంది. నవరమైనా పెట్టుకోకుండా చక్కగా భుజం మీంచి, గుండెల మీంచీ, బొడ్డుకిందకి దిగి దారెడు జడ వుంది. జడ అందమైనదే కాని పాపం పిల్ల మాత్రం అందమైంది కాదు!

"చూడూ! మాయింట్లో వస్తువులన్నీ మహా ఖరీదైనవి. ఇసక తోటి చింతపండుతోటి తోమేవికావు! అన్నం గిన్నెమీద నిలబడి మసి పోయేదాకా మడమలతో దాన్ని చెయ్యటం కాదు! మాఇంట్లో సగానికి సగం గాజు సామాను. తెల్సిందా! ప్రెషర్ కుక్కర్ హ్యాండిల్ విరి చేస్తావో, టీసెట్టులో ప్లేట్లు పగలగొట్టేస్తావో అని భయంగావుంది?"

ఈమాటలతో పనిలో పెట్టుకోరేమో నన్న భయం సత్తి మొహంలో కనిపించింది.

"జాగ్రత్తగా సేస్తానమ్మా! తమరు సెపితే సేసుకుపోతాను. ఎందుకు సెయ్యలేనూ? మరి సింతపండు ఎట్టకపోతే మసి ఎనా ఒగ్గు తాదీ" ఎవ్వరింటి కాన్నించైనా కదికలు తెప్పించండి. ఆటిలో తోమి పెడ్తాను. మీగాజు సామాను నాసేతిలో బద్దలైతే జీతంలో వాట్టేసు కోండి" అన్నది. నిజాయితీ అయిన మనిషే!

"కచికలూ చింతపండు కాదు! విమ్ పౌడరుతో తోమాలి ఎంతో జాగ్రత్తగా తోమాలి. అసలు మాఇంట్లో తిరగడమే ముందు తెలుసుకోవాలి. అదుగో ఆ అయిమూల చూసేవా? ఆగాజు కూజా! అదెంతనుకున్నావ్! ఎనభై ఆరు రూపాయలకి కొన్నాం. ఇదిగో ఈ టేబిలు మీద పువ్వులు పెట్టిన గాజు వేసుంది చూసేవా? అది పద్దెనిమిది రూపాయలు!! ఎలా పని చేస్తావో ఏమిటో! నువ్వు చూడబోతే నాటు మనిషిలా ఉన్నావు! డబ్బు విరగొట్టుకోమంటున్నావ్! విరగ్గొట్టుకో గలవా? ఇప్పుడు చెప్పు?"

తమురు సెప్పినారు కదా అటి ఇలువ. నాను అంత మాటన కూడదు కాని తమురి గాజు సామాను కన్నా అద్దువానం. మాఁవు మట్టి దాకలూ, కుండలతో కదా తల్లీ వొండుకుంటాం! నాకు తెల్దా. జాగ్రత్త!" అని సత్తి అంటే ఒక పక్క తెలివైన దాన్లాగానే ఉందనుకుంటూ తన క్రాకరీని దాని కుండలతోటీ, దాకలతోటి పోలిస్తే ఒళ్లు మండింది. దిక్కుమాలిన ముండ! ఎలా అందో! చిత్రం! సత్తి అని సత్తి కాలం మాత్రం కాదు.

"సరే. పన్లోకి రేపట్నించిరా" అని చెప్పి దాన్ని పంపించేసింది

తెలివైన దానిలాగే ఉంది కాని అబ్బ ఆ మొహం చూస్తే ఒళ్లు జలదరిస్తోంది బాబూ!" అని మొగుడితో అంది.

"పనిమనిషి అందమైనదైతే ప్రమాదం. మనలాంటి ఇళ్ళల్లో ఇలాంటిది ఉండడమే మంచిదనుకో" అన్నారు ఏజంటుగారు.

"ఈ కాలం మొగాళ్ల, అందులో మీ ఆఫీసరూ మీ బుద్ధులూ అలాగే ఉన్నాయిలెండి.ఏమైనా మనచుట్టూ ఉన్నవాళ్లు కాస్త ప్లెజంటుగా లేకపోతే బాగుండదండీ " అన్నది.

కాని కొత్తపూరు ప్లెజంటుగా లేదు. మహిళామండలి సభలో గుసగుసలు విన పడ్డాయి. మాటల్లో శ్లేషలు ఉన్నాయి. తన మీదే విసుర్లున్నట్టు అనిపించింది. ఎందుకు చెప్మా అని అనుమానంలో పడిపోయింది.

ఏమో అనుకుంది కాని సత్తి తెలివైనదే. ఒక సుళువు చెపితే నాలుగు సుళువులు గ్రహిస్తుంది. రూపం ఎలా ఉన్నా పని చక్కగానే చేసుకుపోతోంది. పొట్టకోసం చాకలి పనికూడా చెయ్యాల్సి వచ్చింది కదా అని గొణుక్కుంటూనే మొదటి రోజు బట్టలు ఉతికింది. తర్వాత అయమ్మగోరు సెప్పినట్టు ఆ పవుడరు ఏసి ఆబట్టలు ఉతుకుతే నీలి మందుతో గెంజి ఎడితే ఆకరంటు పెట్టెతో ఇస్త్రీ సేస్తే ఎంత మల్లి పువ్వులా బట్టలున్నాయో చూసి తన కోపాలి ఉతుక్కుంటే బాగుణ్ణని మనసు పడిపోయింది. భయపడిపోతూ భయపడిపోతూ "అమ్మగోరూ, నాకోక ఉతుక్కుంటాను. నాకో పిసరంత పవుడరు ఎట్టరా" అని అడిగింది.

"అదే నేనూ చెపుదామనుకుంటున్నాను. నీకు పుణ్యం ఉంటుంది. ఆచీర ఉతుక్కో ఆకుళ్ళు గుడ్డ చూడలేక ఛస్తున్నాను," అని కసురుతూనే ఇంత సర్ఫ్ గుండ దిమ్మరించింది, ఆరోజునుంచి సత్తి శుభ్రమైన చీరతోనే కనపడుతోంది!

మహిళా మండలివారు ఓ మహానాయకురాల్ని ఉపన్యాసకురాలిగా ఆహ్వానించారు. తనని ఆవేళ అధ్యక్షురాలిగా ఉండాలని కోరారు. ఆ మీటింగులో తను ఏం మాట్లాడాలి ఎలా మాట్లాడాలి అని ఆలోచించు కుంటున్నాది.

"ఏమండీ! మహిళా మండలి మీటింగులో మాట్లాడ్డానికి నాకు మంచి పాయింట్స్ చెప్తారూ!" అని మొగుణ్ణి అడిగింది.

"నువ్వు కాకినాడలో మాట్లాడావు చూసేవూ—ఆమీటింగులోది టప్పాడించెయ్యి. ఆవేళ బాగా మాట్లాడేవు" అన్నారు ఏజంటుగారు.

మహిళల సమస్యలమీద మాట్లాడాలండీ – అంటే మీకోపం వస్తుందేమో కాని మగవాళ్ళ ఓమాయిత్యాలమీద మాట్లాడాలని ఉంది."

"ఏం మగవాళ్ళ మంచి మీద మాట్లాడకూడదూ!" అన్నారు.

"చుటూ ఇంత అవినీతి కనబడుతూఉంటే. పదిమంది మొగ

వాళ్ళు వచ్చినప్పుడు పొరపాటుగా ఉన్న మగవాళ్ళ మొహం మీద ఓ వాత పెట్టాలి. అవునంటారా? కాదంటారా:"

"అవునూలేదు, కాదూలేదు అదంతా ఎందుకు పోనిద్దూ. చక్కగా పొదుపు కార్యక్రమాలు ఏవో వున్నాయిగా మీవి! ఆడవాళ్ళ సమస్యలు, ఇద్దరూ తప్పితే ముగ్గురూ! ఏదో మాట్లాడు! అలాంటిదైతే నికెవరూ ఏం చెప్పక్కర్లేదు! కొట్టిన పిండికదా!"

"అబ్బే — వాళ్ళు ఏర్పాటు చేసిన సభకి అదేం కుదరదండీ— అందులో ఉపన్యాసకురాలు మార్క్సిస్టు నాయకురాలు. ఆవిడ దగ్గర నేనేం తీసిపోకూడదు!

"సరేలే — ఏవో రెండు పుస్తకాలు చూసి నాలుగు పాయింట్లు చూద్దాం. ఇంకా ఉందిగా టైమ్! అన్నాడు ఏజంటుగాడు. ఆవేళ సత్తి పన్లోకి రాలేదు. అదొచ్చే వేళ బాగా దాటిపోయింది. సభలో ఏం మాట్లాడదామా అన్న సమస్య ఎంత తీవ్రంగా ఉందో సత్తి రాకపోతే ఎలాగురా భగవంతుడా అన్న సమస్య అంత తీవ్రంగా కలవర పెట్టింది. కాని పాపం సత్తి వణికిపోతూ మూలుక్కుంటూ వచ్చింది.

"ఏం ఇవాళ ఆలస్యమై పోయిందీ" అని ముందు అధార్టీతోనే అడిగింది, కాని దాని మొహం చూసి "ఏమే జ్వరంకాని వచ్చిందా" అని మళ్ళీ నెమ్మదిగా అడిగింది.

"జొరంకాదు తల్లీ! నిలకడ తన్నినినాడు. రప్పలాగేసినాడు. ఆడి వాట తెలీనేదు. సుట్టుపక్కలవోళ్ళు ఏం కాపాడతాడు తల్లీ మొగుడు కొడుతూ ఉంటే! సచ్చేపోదును! సస్తే ఆడిపీడా నా పీడా వొదులిపోను. పొద్దున్నెగిసి కొట్టేసినానా అని ఆడకూతుల్నా ఏడపడం మొదలెట్టినాడు. ఏటి సెప్పను? మా బతుకులు. తమ కాడికొస్తే ఈ ఒళ్ళు నొప్పులకేటన్నా మందిస్తారేమో ఏడిగా కూసిన్ని కాఫీసుక్క లిస్తారేమో అని ఒచ్చినాను" అని సత్తి కూలబడ్డాది. తాగడం, తన్నడం సత్తి

మొగుడికి పరిపాటే. ఇల్లాగా తావులు తింటూ బతుకు తున్నట్టు చెప్పింది కాని ఇంత తన్నులు తిని ఎప్పుడూ రాలేదు.

"ఎందుకే అంత తన్నులు తింటూ ఆ మొగుడితో కాపరం చేస్తావు? వాడితో తెగతెంపులు చేసేసుకో. ఎప్పుడూ తంతున్నాడనే చెప్తావు! ఆపాటి మొగుడు మరోడు దొరక్కపోతాడా? ఏ ఉద్యోగం చేస్తున్న వాణ్ణో నేనే కుదిర్చిపెడ్తాను." తనకున్న భావాలతో సత్తికి సలహా యిచ్చింది.

"తమురే అంతమాట అంటారా తల్లీ! మొగుణ్ణి కట్టుకోడం ఒగ్గిడానికా? మనువుం నిలిబెట్టుకోడంలో ఉందికాని మను వొగ్గిడాని కేముంది అమ్మా! ఎవతో ఉంటాది ఓ జెష్టనాయాలు. నువ్వెంత అంటే నువ్వెంత అనేది. నాను అలాటిదాన్ని కాదు తల్లీ" అన్నాది సత్తి.

"తాగి వచ్చినవాడు ఓ మూల పిల్లిలా పడుకోకూడదూ? తాగి తన్నేవాళ్ళు ఆఫీసర్ల వర్గంలోనూ ఉన్నారు. కూలి చేసుకునే అడ్డుగు వాడు పెద్ద ఫస్టుక్లాసు ఆఫీసరుగా పనిచేస్తున్నవాడు పెళ్ళాన్ని తాగి తన్నడంలో ఒకేస్థాయి నుంటున్నారు.

"మోతాదుగా తాగి పడిస్తే బాగుణ్ణు, మితిమీరిపోతారు. ఇది అరికట్టబడేటట్టు లేదు. ఈ మగాళ్ళు వాళ్ళు తాగడమేకాక పెళ్ళాల చేతా తాగిస్తున్నారు. ఇది మంచి పాయింటే. దీనిమీద ఓ ఘెణుకు ఘెణకాలి" అని మొగుణ్ణి ఉద్దేశించి అన్నాది. ఆయనా కాస్త పుచ్చుకుంటూ ఉంటాడుకదా?

"ఆఁ ఆఁ చెప్పు చెప్పు. పెళ్ళాల చేత తాగిస్తున్న మొగుళ్ళమీద చెప్పు కాని మగాళ్ళమధ్య వాళ్ళకి వాళ్ళే తాగే ఆడవాళ్ళున్నారు. అది నీకు తెలీసు" అని ఏజంటుగారు నాలిక్కరుచుకున్నారు.

సభ దగ్గర పడ్డాది కాని ఏరోజుకారోజు దాని సంబంధంలో తిరగడం పదిమందితో మాట్లాడ్డం అవుతున్నాది కాని తాను సభలో ఏం మాట్లాడ్డమో సరిగా అనుకోడం పడలేదు. ఓనాడు రాత్రి తొమ్మిది

పదిగంటల వేళప్పుడు గేటు తీసుకుని సత్తి వెర్రిపిరులా లోపలికి వచ్చింది.

"ఆడు ఈదిలోకి గెంటేసినాడు తల్లో" అని గొల్లుమంది.

"గెంటేసేడూ? పోన్లే సత్తీ! బతికేవనుకో! అలాంటి మొగుడితో ఎంతకాలం అని బాధపడతావ్! వాడు తరచు తాగి తంతూనే ఉంటాడు. మీలో మారు మనువు వుంది కదా! చక్కగా వాణ్ణి ఒదిలెయ్ నేనెన్ని సార్లె చెప్తున్నాను. వాణ్ణి కట్టుకొన్నా వన్న పేరేకాని వాడు నిన్ను ఏం పోషిస్తున్నాడు? నీ రెక్కల కష్టం మీద నువ్వుబతుకున్నావు. వాడు తెచ్చింది వాడుతాగి తందనాలాడుతున్నాడు! ఇదే విదేశాల్లో అయితేనా? ఇట్టి మొగుణ్ణి వదిలేసి మరో మొగుణ్ణి కట్టుకుంటారు! తను చెప్తోందికాని తన ఆధునిక భావాలు సత్తిమీద పనిచెయ్యటం లేదు.

తాగి గెంటేసేరుతల్లో! కొప్పులో పువ్వు లెట్టుకున్నానంట? కొత్త పెళ్ళికూతుర్నా ఉన్నానంట! ఆడిచ్చిన కొత్తకోక కట్టేసుకున్నానుట! అనుమానం ఎట్టేసుకున్నాడు. తన్ని రోడ్డు మీదికీడ్చేసినాడు.

"ఏమిటేమిటి? సరిగ్గా చెప్పు? నువ్వేం చెప్తున్నావో బోధపడ లేదు" అన్నాది.

"సిన్నా-మా మావఁవొచ్చినోడమ్మా — మాతల్లి కడసారపు తమ్ముడు. ఆడు మహానదికి వొంతెన కడ్తున్నారని కటకం పోయినాడు. ఆవెల్లడం ఎలడం మరిఇంటికి రానేదు. ఆ ఎలడం ఎల్లడం కటకం కాశీమెట్టి కలకత్తా ఆకూలీ ఈకూలీ సేసుకుంటూ ఆ దేశాలు పట్టిపోనాడు. నలుగురినీ సూడాలని దివితో దేశం వొచ్చినాడు. అందర్నీ సూసినాడు. నన్ను సుడ్డానికి మనూరొచ్చినాడు. మేనమాఁవా! నాకో కోక ఎట్టినాడు. ఆడితో కులుకుతూ మాటాడినానుట — తల్లోపువ్వులెట్టి సోకుసేసినానుట-ఆడు కోక ఎడితే సింగారించుకున్నానుట. ఆడికీ నాకూ రంకు కట్టేసినాడు అమ్మా! ఆడకూతుర్నని—రాక రాక వొచ్చినాడు ఓ పాపలా సేమంతి పువ్వులదండ కొని ఇచ్చినాడు. తప్పా?? ఈ రోజుల్లో కోక

ఎట్టినాడంటే ఆడు నాలుగు డబ్బులు సేసినాడు కాబట్టి ఎట్టినాడు కాని లేపోతే ఎవుఁడు ఎట్టగలడూ? ఇన్నాళ్ళకి మామ వొచ్చినాడు— కోక ఎట్టినాడు అని నాను సంబర పడిపోతూ ఉంటే నన్నీదిలో ఎట్టి కొట్టి రంకు కడితే నానే గాతలో పడను? మా మావ ఎదురుగుండా పదిమందిలో నన్ను రచ్చకీడ్చినాడు. తమురు సెప్పినట్టు ఈ మొగుడితో కాపురం సెయ్యడం సెడ్డ కష్టంగా ఉంది. ఈ అద్దురేత్రి కాడ ఎక్కడికి ఒల్లనూ? తల్లోంటి నోరు తమురు అని పాలొచ్చినాను." సత్తి ఏడుస్తూ చెప్పింది.

"నే చెప్పటం లేదే? వాడితో బతుకు నీకు వెళ్ళదు."

"మరి నాలుగు పూటలు ఇంటికి వెళ్ళనమ్మా - తమురింటి కాడ ఉండిపోతాను" అన్నది సత్తి.

"అలాగే ఉండు. పది గంటలు కావొస్తున్నాది. ఈయన రోజూ ఈ క్లబ్బులు మరిగి పేకాడుతున్నారో ఏం చేస్తున్నారో అయన ఇష్టం. పదీ పదకొండూ పన్నెండూ చేసేస్తున్నారు. నువ్వొచ్చేవు. ఇదీ బాగానే ఉంది. అవును కాని సత్తి-ఆ మూడో బంగళా ఉంది చూసేవా? ఇంజనీరు గారిది. ఆయన పెళ్ళాన్ని నువ్వు ఎరుగుదువా?"

"లావుపాటిదాయి-ఆ యమ్మేనా? నానెందు కెరగనూ? ఇంజనీరు గారి పెళ్ళాం. నల్ల మంగమ్మ గోరు—"

"ఆఁ మంగమ్మగారే! ఆవిణ్ణి నల్ల మంగమ్మ అంటారా?"

అక్కడ పోలీసు బాబు ఉన్నారు కదమ్మా? ఆయన పెళ్ళాం తెల్ల మంగమ్మ గోరు - ఈవిడ నల్ల మంగమ్మ గోరు - ఆవిడ కాడ నాను కొన్నాళ్ళు పన్సేసి నావొల్లకాక మానేసినాను"

"ఆవిడ మనిషి ఎలాంటిదే?"

"అమ్మా పెద్దింటోళ్ళ ఇసయాలు ఇనినా తమబోటి వాళ్ళదగ్గర మాబోటి వాళ్ళం అనకూడదు తల్లీ. ఆవిడ బుద్ధి మంచిది కాదమ్మా!

సీ! సీ! మొన్న నన్ను పిలిసి మీ మీద ఎయ్యి ఆరాలు తీసింది. సీ! సీ! ఆవిడ ఊసు ఎత్తకమ్మా! మీరెక్కడ! ఆవిడెక్కడ!"

"ఏమిటీ? నామీద ఆరాలేం తీసిందీ?"

"ఏటీ నేదమ్మా! బాబుగోరు మీరు ఎలా ఉన్నారో ఆవిడకి కావాల!"

"మేమెలా ఉంటే దానికేం?"

"కావాలి కదమ్మా! సెప్పకూడదు కాని బాబుగోరు మరి ఆరింటి కాడే కదమ్మా ఉంటారు!"

"ఏమిటే! నువ్వంటున్నదీ?"

"ఊరి కెవుడొచ్చినా ఆళ్ళని బుట్టలో వేసేస్తాది. కుక్కని తిప్పి నట్టు తనెంట తిప్పుకుంటాది. ఆ మొగుడోనాడూ ఊళ్ళో ఉండి సావడు. నాలుగు రోజులై కొండల్లోకి పోనాడు. ఈయమ్మ కోరికలు తీరుసుకుంటాదిక్కడ! అదంతా ఎందుకు అమ్మగోరూ! మీరు సాయంత్రం ఓసారి గేటు దాటి రోడ్డుమీద నిలబడి సూద్దురూ, బాబుగోరు కార్లో ఆరింటికి ఎల్తూ కనపడిపోతారు!"

పెదవి కరుచుకుని, కళ్ళు చీకట్లు కమ్మినట్లయి తను అలా ఉండి పోయింది. నిజమే! మహిళామండలిలో నలుగురి మాటల్లో ఉన్న శ్లేష కిన్నీ సత్తి చెప్పినదానికి సరిపోయింది. అన్నా! అని ఆలోచనలో పడిపోయింది. సత్తికి సుళువుగా మొగుణ్ణి వదిలెయ్యమని వచ్చిం దగ్గ ర్నుంచి చెప్పుకు వస్తున్నాది. తనేం చెయ్యడం? సత్తికేం! పిల్లల్లేని ఆడది. తను ఇద్దరు పిల్లలతల్లి. కాన్వెంటుకి వెళ్తున్న జ్ఞానం వచ్చిన పిల్లలు. సత్తికి వేషంవేస్తే నల్లమంగమ్మ కేం తీసిపోదు. తన మొగుడు దాని వ్యామోహంలో ఎలా పడ్డాడు చెప్మా? బహుశా అదొక్కత్తి కాబోలు- మగవాడితో కలిసి తాగ్గలిగే ఆడది! అమాయకురాల్లా కని పించిన సత్తికి ఎన్ని విషయాలు తెల్సూ?!

మహిళామండలి మీటింగుకు తాను అధ్యక్షురాలి పదవిని అలంక రించింది. ఆ పని ఈ పనీ చేస్తుందని సత్తిని తీసుకు వెళ్ళింది. సభలో

తన మొగుడూ కూర్చున్నాడు. మీటింగులో ఏం చెప్పడమా అని ఆలోచించింది కాని తను అనుకోకుండానే తన నోరు విచ్చలవిడిగా ఈనాటి పెద్దవాళ్లు ఎలా సంచరిస్తున్నారో, అట్టడుగు వాళ్ళు ఎలా సంచరిస్తున్నారో, ఆడవాళ్ళు ఎలా సంచరిస్తున్నారో, మగవాళ్ళు ఎలా సంచరిస్తున్నారో అడుగు వాళ్ళకి నాయకత్వం వహించి సన్మార్గంలో పెట్టాల్సిన పెద్దవాళ్ళ బుద్ధులు ఎంత పెడమార్గంలో పోతున్నాయో అటు నల్ల మంగమ్మ మొహం చూస్తూ ఇటు మొగుడి మొహం చూస్తూ దులపవల్సినంతా దులిపేసింది. మంచి ఉపన్యాస ధోరణి ఉన్న మనిషేమో శ్రోతల్ని ఓ కదుపు కదిపేసింది. ఒటు నల్ల మంగమ్మకి ఇటు తన మొగుడికీ బాగానే ఏవం బారి ఉంటాలి.

కాని ఏజంటుగారు ఇంటికి రాత్రి ఆలస్యంగా రావడం తరుచు సంభవిస్తూనే ఉంది. ఏ నాడూ తప్పతాగి రాడు కాని కుషీగా వస్తాడు. ముసుగెట్టి పడుకుంటాడు. ఓనాడు అర్ధరాత్రి పన్నెండు గంటల తర్వాత మొగుణ్ణి నిలదీసి అడిగేసింది. దాంతో మగవాడి అహం అంతా బైటికి వచ్చింది.

"మగవాడన్న వాడికి వెయ్యి పన్లుంటాయి. ప్రతీదీ నీకు చెప్పాలా? అని ఒంటి కాలిమీద లేచేడు. ఆయన రహస్యం తనకి తెలిసి పోయిందన్న సంగతి ఎరిగి మరీ ఎగురుతున్నాడు.

"మీ వెయ్యి పన్లేమిటో నాకు బాగా తెల్సు. సాయంకాలం రోజూ మీరు కారు దిగి ఎక్కడికి వెళ్తున్నారో నా కళ్ళారా చూస్తున్నాను. ఇన్నేళ్ళొచ్చి, ఇద్దరి పిల్లల తండ్రయి...." నిగ్రహించుకోలేక వెక్కి వెక్కి ఏడ్చేసింది.

ఆ రోజునుంచి ప్రతిరోజూ జట్టీలే. ప్రతిరోజూ ఏడుపే-ముందూ వెనకా చూడకుండా మొగుణ్ణి దుయ్యబడుతోంది. ఏడుస్తోంది. తను దెబ్బలాడుతూ ఉంటే పిల్లలు వింటున్నారన్న జ్ఞానం కూడా పోయింది. వాళ్ళకీ అంతా తెలిసిపోయింది. సత్తికన్నా హీనమైన స్థితిలో తనే

పడ్డాది. సత్తి మొగుడు దానిమీద వ్యామోహంతో దాన్ని తన్నాడు. అభిమానం వుండబట్టి అభిమానించాడు. తక్కువవాడు కాబట్టి తన్నాడు. ఈ ఎక్కువవాడు తన్నేం చేస్తున్నాడు. చల్లగా నోరుమూసుకుని ఊరుకుంటేనే బాగుండిపోతుంది కాబోలు! నిలదీసి అడిగితే ఆయన బరిదిగి పోయేడు.

"వెళ్తే వెళ్తాను. నా యిష్టం. నీకేం. నీకేం తక్కువ చేసేను" అని ప్రశ్నించేడు.

"రెండుపూటలా ఇంత పడేస్తున్నారు ఏజంటుగారి పెళ్ళామని ఇంత హోదా ఉండనిస్తున్నారు. అంచేత నోరు మూసుకుని పడి ఉండాలట. మహిళల గురించి తాను ఊహించుకుంటున్న స్వాతంత్ర్యం, సమానత్వం రస విషయంలో ఈ కాడికి వచ్చాయి.

ఆ వేళ సత్తి మొగుడితో దెబ్బలాడి వచ్చిందా-ఆ వచ్చింది ఆ మర్నాడే మళ్ళీ ఇంటికి వెళ్ళిపోయింది! మామూలుగా కులుకుతూ కన పడుతున్నది. అది జరిగిందంతా ఇట్టే మర్చిపోయినట్టున్నది! సత్తి నీ మొగుడితో అంత తగువుపడ్డావు. ఇప్పుడంతా సద్దుకు పోయిందా?" అని అడిగింది. వాస్తవానికి సత్తికి మొగుడితో తగువు లేనేలేదు. తాగి తన్నినా దాన్ని నమ్ముకునే అమాయకుడు. తాగిఉన్న అమాయకుడైనా భరించడం కష్టమే! అభిమానంతో పీక కోస్తాం అంటే ఎలాగ? అన్యాయం-సత్తికి తాను చాలాసార్లు చెప్పింది.

"ఏటి సద్దుకోడమమ్మా! ఆడు తాగడం మానడు. తగవూ తప్పదు. ఇంటికి పైసా గెంజినీళ్ళకి ఇవ్వడు. నాను తమ ఇంటకాడ తిన్నదే నా నోట్టుకెళ్ళి ఎడితే కుక్కలా తినేస్తాడు! తాను తెచ్చింది తాగి తందనా లాడేస్తాడు! ఏం మొగుడో ఏం లోకమో తల్లీ?"

"ఏమిటేవ్ అలా అంటున్నావు? మొగుణ్ణి కాని వదిలెయ్యావు కదా!"

"ఒగ్గిమని సబవూ సెప్తారు. నా నినాగంటే మీ రనాగ అంటారు. అమ్మా! నాను అనుకోడదుగాని బాబుగోర్ని తను రొగ్గిగలరూ?

చనువు ఎక్కువై పోయిందేమో ఛడీమని అడిగేసింది.

"మా బాగా అడిగేవ్. దాంతోటే నా బుర్ర సతమతమవు తున్నాది. నువ్వుచెప్పినట్లు వదిలెయ్యడం ఏం సుళువుకాదు. పెళ్ళాడిన ఆడది అందులో పిల్లల్ని కనుక్కున్న తల్లి మొగుణ్ణి ఏం వదిలేస్తుంది? ఆ మొగుడు హీనం చేస్తే ఆ హీనం బతుకే బతకాలి. అలాగ్గానే కనపడు తోంది" అని సత్తికి చెప్పి కళ్ళమ్మట నీళ్ళు పెట్టేసుకుంది. "సత్తీ మా ఇంటి భోగట్టా ఎవరి దగ్గరా చెప్పకేం! నిన్ను బతిమాలు కుంటాను..." అని గెడ్డాం పట్టుకుంది.

"సా! సా! నా నెందుకు ఈదిని ఎడ్తాను తల్లీ! తమ నాటి అమ్మని ఇంతకాలం అయింది నానెక్కడా సూడనేదు. ఆ బాబు ఉసురికి ఆ బాబే పోతాడు తల్లీ! ఎప్పటి కన్నా నిజం తెలుసుకుంటాడు" అని సత్తి ఎదురుబోధ చేసింది.

సత్తి తనకి ఎదురు చెప్పడం చూడగానే తను చాలా చిన్న పోయింది. ఛీఛీ! దాని దగ్గరెందుకన్నానా అని లోపల అనుకుంది. ఇహ మొగుడితో జట్టీ పెట్టుకుంటే బతుకు మరింత అధ్వాన్నం చేసు కుంటున్నట్టే కనిపించింది. ఆ వారం మహిళా మండలి సమావేశానికి వెళ్ళడం మానేసింది. ఇహ నా మొహం పెట్టుకొని వెళ్ళడానికి వేదిక ఎక్కడానికి తనకి ఏ అర్హతా లేదని తెల్సుకున్నది!

సత్తి దాని మావిచ్చిన కొత్త కోకనీ, దానిమీది ఎర్ర జాకెట్టునీ ఆరేసుకుంది. బంగళాచుట్టూ బారకాసులా ఉన్న పెరడంతా ముచ్చటైన తోటగా తనువచ్చిన నెల్లాళ్ళకే పెరిగింది. ఇప్పుడు మరీ శోభాయమానంగా ఉంది. చుక్కల గులాబీ పువ్వులు పొదనిండా ఒక్కనాడె పాతిక పూసేయి. దాని పక్కనే ఎర్రగులాబీలు, ఆ పక్కని నాడాంబరం రంగు గులాబీలు విరగబూసి ఎంత ముచ్చటగా ఉన్నాయో అంత తనని వెక్కిరిస్తున్నాయి. ఎందుకీ పువ్వులు? పిల్లలకి పెట్టుకుందామంటే

ఇద్దరూ కొడుకులే! తోటమాలి హోసుతో నీళ్ళు పోస్తూఉంటే వాణ్ణాపని మాన్పించేసి పంపించేస్తే బాగుణ్ణని అనిపించింది.

"సత్తీ!" అని సత్తిని కేకేసింది. చూడూ ఆ నాలుగు గులాబీ చెట్లపువ్వులు నాలుగు కోసి చక్కగా గుత్తి కట్టుకుని తల్లో పెటుకోవే! వెనకనుంచి నీతల అందం పాపం నీకు తెలీదు! ఎవరి తల అందం ఎవరికీ తెలీదులే!"

"తమురే ఎట్టుకోరుకదా నన్నెట్టుకోమంటున్నారేటమ్మా!" అన్నాది సత్తి అమాయకంగా. దానికి విడ్డూరంగానే కనబడి ఉంటుంది. ఒక్కనాడు ఒక గులాబీ పువ్వు తెచ్చిపెట్టుకోమని ఎప్పుడూ ఇవ్వలేదు. అలా రేకులు పాడిలో పడిపోతూ ఉండాల్సిందే!

"పెట్టుకోవే — పెట్టుకోడానికి అర్హత ఉన్న దానిని నువ్వే! పువ్వులు పెట్టుకుంటే చూసి ఆనందించడానికి నాకు ఎవరు ఉన్నారు."

"ఈయాల తముని పువ్వులొడిగి ఒట్టు కెళ్దామని అనుకున్నానమ్మా! నా మనసెరిగి ఎనా ఎట్టుకోమన్నారమ్మా! మీకే దేవుడు సెప్పినాడో!" దాని మొహం ఆ విడిస గులాబీ పువ్వుల్లాగే సంతోషంతో రేకలు విడుస్తున్నాది. ఆ అంద వికారం అయిన మొహంలోంచి సంతోషం ఎంత అందాన్నిస్తున్నది! ఆ మొహానికి లేని పరిమళం ఉన్నట్టే కనబడుతున్నది.

"తమురు తల్లి వొంటివోరు. ఈ దిక్కుమాలిన ఊళ్ళో కడుపులో మాట సెప్పుకుందామంటే నాకు అయిన తల్లి ఒకత్తీ లేదు. తమురొక్కరే!! నానీపొద్దు పుట్టింటి కెళ్ళిపోతున్నాను. తమురు సెప్పినట్టే ఈ మనువు ఒగేసుకుంటున్నాను. ఎప్పుడు పడ్నమ్మా ఈ బాధలు!!

"అదేమిటేవ్!"

"మా మావ అన్నాడూ - ఆడు నిన్ను బాది సంపుతున్నాడు. నీకూ నాకూ లేని రంకు కట్టినాడు. ఆణ్ణోగిచ్చేయ్ తగపు ఇచ్చేసి తెగతెంపులు చేసేద్దాం. నిన్నునానే కట్టుకుంటాను. అప్పుడు మా యమ్మ

మామయ్య మా యన్నదమ్ములు మా ఊరి పెదోళ్ళుసిన్నోళ్ళు ఒక్క మాటగా అందరూ తెగ తెంపులు సేసెయ్యి అన్నారు. అమ్మా! ఇంకా నా మొగుడికి తెల్దు. మా యన్న వచ్చేడు. నన్ను పుట్టింటికి తీసుకెళ్తున్నాడు. తమురి ముఖం మళ్ళీ సూస్తానో సూడనో ఈ ఊరు మరి తిరిగి రాను" అని చెప్పింది.

తనకన్నా సత్తి ఎన్నిరెట్లు మెరుగు! తనే కాదు ఎంతమంది చదువుకున్న వాళ్ళు ఈ చదువుకున్న పెద్దవాళ్ళని కట్టుకుని తన కన్నా హీనమైన బతుకు బతుకుతున్నారు. బంగళాల్లో సీతాకోక చిలకల్లా కనపడతారు. కాని ఆ బంగాళాల్లో వాళ్లు బందీలే.

చక్కగా పువ్వులు పెట్టుకుని మావ పెట్టిన కోక కట్టుకుని తన దగ్గర సెలవు పుచ్చుకుని కట్టు గుడ్డల్తో చడీ చప్పుడూలేకుండా సాయంకాలం సత్తి పుట్టింటికి వెళ్ళిపోయింది. ఆ ఊళ్ళో అంత చక్కటి దాసీది మరొకత్తి దొరకడం కష్టమే.

గేటవతల రోడ్డుమీద నిలబడి పరీక్షగా తన మొగుడు కారుదిగి నల్ల మంగమ్మగారి బంగళాలోకి వెళ్ళడం కళ్ళారా చూసి తను ఇంట్లోకి వచ్చేసింది.

సత్తి వెళ్ళిపోయింది కాని తానుమాత్రం ఈ బంగళాలో ఈ మొగుడి హోదాని మోసుకుంటూ పిల్లల్తో ఉండడం ఖాయమ్!